క్లుప్తంగా

కస్తూర్బా విద్యార్థుల కష్టాలు పట్టవా?

రాజోళి: కస్తూర్బా గాంధీ విద్యార్థుల కష్టాలు అధికారులకు ఎందుకు కనిపించడం లేదని కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. రాజోళి, వడ్డేపల్లి మండలాలకు చెందిన విద్యార్థులను వడ్డేపల్లిలోని ఒకే భవనంలోనే ఉంచుతున్నారని, దీంతో వారు ఎన్ని కష్టాలు పడుతున్నారో అధికారులకు తెలియడం లేదా అని ప్రశ్నించారు. ప్రతి రోజు వారితో పాటు ఉండే సిబ్బంది కూడా పై అధికారులకు ఈ సమస్యలను విన్నవించడం లేదా? ఒకవేళ చెప్పినా వారు పట్టించుకోవడం లేదా అని తెలిపారు. ఒకే భవనంలో వంద మంది బాలికలను ఉంచితే వారి పరిస్థితి చాలా దారుణంగా ఉందని, ఈ మధ్య కాలంలో డీఈఓ పరిశీలించిన తర్వాత కూడా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సరైన వసతులు కల్పించకుండా ఉంటే పెద్దఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

గ్రామాల్లో పంటనమోదు

మానవపాడు: మండలంలోని పల్లెపాడు, పెద్ద ఆముదాలపాడులో సోమవారం మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పంటనమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆయా శివారు ప్రాంతాల్లో ఏ పంట రైతు సాగు చేస్తున్నారో నమోదు చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి వంతుల వారీగా అర్చకత్వ పూజలలో భాగంగా సోమవారం ఆలయ ధర్మకర్త గిరిరావు సమక్షంలో స్వామి వారి కై ంకర్యములు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే ఏరువాక పౌర్ణమి వరకు ఆలయ ప్రధాన అర్చకుడిగా ఆద్య వామనాచార్యులు, కిష్టాచార్యులు, మధ్వాచార్యులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



అయిజ: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎంఈఓ నర్సింహ అన్నారు. ఆయన ఆదేశాల మేరకు పట్టణంలోని జీవీఆర్ఎం పాఠశాల గదిని సోమవారం ఎమ్మార్సీ సిబ్బంది సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పాఠశాలను సీఆర్‌పీ తిరుమలేష్ తనిఖీ చేశారని, పాఠశాలలో అన్ని తరగతులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఆ గదిని సీజ్ చేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

బల్బులు ఏర్పాటు చేయండి

మానవపాడు: మండలంలోని కేజీబీవీ పాఠశాల ఎదుట విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. దానికి బల్బులు బిగించకపోవడంతో రాత్రి సమయంలో చీకటిమయంగా ఉంది. చాలా సార్లు విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి బల్బులు వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రియదర్శిని పూర్వ విద్యపై అవగాహన



మానవపాడు: ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక విద్య చిన్నారుల అవసరాలకు అనుగుణంగా రూపొందించినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆరు మండలాల అంగన్‌వాడీ టీచర్లు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పూర్వ ప్రాథమిక విద్యాదీపిక అంగన్‌వాడీ టీచర్లకు పాఠ్యప్రణాళిక 'ఎందుకు.. ఎలా ఉండాలి' అనే విషయాలను వివరించడంతోపాటు, వివిధ కార్యక్రమాల నిర్వహణ, తక్షణ సూచనలు, ప్రక్రియలను అవగాహన చేసుకోవడం వివరిస్తారన్నారు. శిక్షణ తరగతులకు సీడీపీఓ, సూపర్‌వైజర్లు ఆస్మా, వెంకటేశ్వరి, పుష్ప, మయూరి పాల్గొని మాస్టర్ శిక్షణ పొందారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు బ్యాచ్‌కి 30–35మంది ఉండేలా 7 బ్యాచ్‌లుగా విభజించి ప్రతి బ్యాచ్‌కి 3రోజులు ప్రత్యేక శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. మొదటి శిక్షణ తరగతులను ఒక బ్యాచ్ ప్రారంభించామన్నారు.

గుంతలమయం



జిల్లా కేంద్రంలో కృష్ణవేణి చౌరస్తాలోని గుంతలమయమైన రోడ్డు

- జిల్లా కేంద్రంలో అధ్వానంగా రోడ్ల దుస్థితి
- వాహనదారుల ఇబ్బందులు
- మరమ్మతులకు నోచుకోని వైనం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని రోడ్లు గుంతలమయంగా మారడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. గుంతలరోడ్లతో ప్రయాణికులు అసౌకర్యాలకు గురవుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్ల తాత్కాలిక మరమ్మతుకు సైతం నోచుకోవడం లేదు. జిల్లా కేంద్రంలోని రోడ్ల దుస్థితి ఈ విధంగా ఉంటే గ్రామాల్లో వెళ్లే రోడ్లు ఏ విధంగా ఉంటాయో ఇట్టే అర్థమవుతుందని స్థానికులు వాపోతున్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు..

జిల్లా కేంద్రం నుంచి అయిజకు వెళ్లే దారి రైల్వేస్టేషన్ నుంచి పరుమాల స్టేజి వరకు పూర్తిగా అధ్వానంగా తయారైంది. అడుగుకో గుంత అన్నట్లుగా మారింది. రెండో రైల్వేగేటు, పంచాయతీ రాజ్ కార్యాలయం ఎదుట, అంబేద్కర్ చౌరస్తా, కృష్ణవేణి చౌరస్తా తదితర ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. అసలే వర్షాకాలం కావడంతో చిన్నపాటి చినుకులకే గుంతలయమంగా ఉన్న రోడ్లపై నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఏ గుంత ఎక్కడ ఉందో, ఎంత లోతుగా ఉందో కనిపించకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వాహనదారులు, స్థానికులు ప్రయాణాలు సాగించాలంటే నానా యాతన అనుభవిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే జంకుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

జిల్లా కేంద్రంలో రోడ్లు మరమ్మతు చేయకపోవడంతో వాహనదారులకు, స్థానికులకు ఇబ్బందులు తప్పట్లేదు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవట్లేదని వాపోతున్నారు. నిత్యం ఇదే రోడ్లపై జిల్లా ఉన్నత స్థాయి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ప్రయాణాలు సాగిస్తుంటారు. అయినప్పటికి పట్టింపులేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> **మరమ్మతులు చేయిస్తాం**
>
> జిల్లా కేంద్రంలో గుంతలమయంగా ఉన్న ఆర్అండ్‌బీ పరిధిలోని రోడ్లను మరమ్మతు చేయిస్తాం. అయిజ రోడ్డు ఇది వరకే టెండర్లు నిర్వహించాం. బిల్లులు లేక పనులు నిలిచిపోయాయి. కృష్ణారోడ్డు అయితే టెండర్ దశలో ఉంది. అంబేద్కర్ చౌరస్తాలోని రోడ్డుకు మరమ్మతు చేయిస్తాం.
>
> – రాజేశ్వరి, ఏఈ, ఆర్అండ్‌బీ, గద్వాల

డిపో మేనేజర్‌కు వినతి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

అయిజ: రైలు వచ్చే సమయంలో ఆర్టీసీ బస్సు సర్వీస్‌లను అందించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సూచించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మధుకుమార్ నాయకులతో కలిసి ఆర్టీసీ డిపో మేనేజర్ మంజులరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం రైలు ప్రయాణం చేసేందుకు అయిజ మండలం నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు గద్వాల రైల్వేస్టేషన్ చేరుకుంటారని తెలిపారు. అయితే ఆర్టీసీ బస్సులు రైల్వేస్టేషన్ క్రాస్ రోడ్డు వద్ద మెయిన్ రోడ్డుపై బస్సులు నిలిపివేసి ప్రయాణికులను దింపివేస్తున్నారని, అదే ప్రదేశంలోనే ప్రయాణికులను బస్సులో ఎక్కించుకుంటున్నారని తెలిపారు. రైల్వే క్రాస్ రోడ్డుకు రైల్వే స్టేషన్‌కు సుమారు కిలోమీటర్ దూరం ఉండడంతో వృద్ధులు, మహిళలు, విద్యార్థులు నడుచుకుంటూ రైల్వేస్టేషన్ చేరుకోవాల్సి వస్తుందని, అంతలోపు రైలు వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఎం హామీ ఇచ్చారు.

ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ ఇవ్వాలి



అలంపూర్‌లో ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సభ్యులు

అలంపూర్: నులిపురుగుల నివారణకు ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు తప్పక వేయాలని ఆర్‌బీఎస్‌కే సభ్యులు ప్రైవేట్ పాఠశాలలకు సూచించారు. పట్టణంలోని మాంటిస్సోరి, గురుదేవ్, శ్రీవెంకటేశ్వర, శారద కాన్వెంట్ ప్రైవేట్ పాఠశాలలను మెడికల్ ఆఫీసర్ రాఘవేంద్ర, డాక్టర్ సవిత, మండల ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మీకాంత్, హెల్త్ అసిస్టెంట్ బాలీశ్వరయ్యశెట్టి సోమవారం సందర్శించారు. నులి పురుగుల నివారణకు ప్రభుత్వం ఈ నెల 20వ తేదీన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతోపాటు ఇతరులకు 1 నుంచి 19 ఏళ్లు నిండిన పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు వేశారా లేదా అని పరిశీలించారు. పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు ఈ నెల 27వ తేదీన రెండో విడతలో వేస్తామని చెప్పినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: దెబ్బతిన్న ఏబీ స్విచ్‌లు, చెట్లను తొలగించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రమేష్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు జిల్లా కేంద్రంలోని వెంకంపేట, నది అగ్రహారం, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, నది అగ్రహారం రోడ్డు మార్గంలో విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అయిజ: మెరుగైన విద్యుత్ సరఫరాను అందించేందుకు చేపట్టిన పనుల్లో భాగంగా మంగళవారం మండలంలోని చిన్న తాండ్రపాడు, కేశవరం, వేణిసోంపురం, మేడికొండ, తుపత్రాలకు ఉదయం 9:30 గంటల నుంచి 12:30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న ఏడీఈ గోవిందు సోమవారం ప్రకటనలో తెలిపారు. అయిజ సబ్‌స్టేషన్‌లోని 132 కేవీ నుంచి తొత్తినోనిదొడ్డిలోని 33 కేవీ ఫీడర్ (ఉత్తనూరు నుంచి చిన్న తాండ్రపాడు వైపు) ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ధరూరు: మండలంలో మంగళవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఏడీఈ రమేష్‌బాబు, ధరూరు ఏఈ అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ లైన్లను తాకుతున్న చెట్లను తొలగించడం, విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మెయింటెనెన్స్ తదితర పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ధరూరు, మన్నాపురం ఫీడర్లలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కోతలు విధించనున్నట్లు వారు తెలిపారు.

బ్యాంకు సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మేనేజర్ శివ

మల్దకల్: మహిళలు బ్యాంకు లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక యూబీఐ అసిస్టెంట్ మేనేజర్ శివ సూచించారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు సోమవారం మహిళ సమాఖ్య కార్యాలయంలో సంఘాల సభ్యులకు బ్యాంకు సేవల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీలు నిర్వహించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఈశ్వరయ్య, ఏపీఎం నరహరి, శేఖర్‌రెడ్డి, శిరీష, రామాంజనేయులు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి గైర్హాజరుపై నిరసన



పాఠశాల వద్ద విద్యార్థులు, గ్రామ యువకులు

ధరూరు: మండలంలోని ఓబోలోనిపల్లి ప్రాథమిక పాఠశాలలో మొత్తం 120 మంది విద్యార్థులకుగాను ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. హెచ్ఎం దామోదర్‌తో పాటు ఉపాధ్యాయుడు చిరంజీవి నాయుడు పని చేస్తున్నప్పటికీ హెచ్ఎం సక్రమంగా రాకపోవడంతో విద్యార్థులు చదువులో నష్టపోవాల్సి వస్తోంది. నెలల తరబడిగా ఇదే పరిస్థితి ఉందని, గతేడాది కూడా ఇదే విషయమై పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. సోమవారం పాఠశాలకు ఒకే ఉపాధ్యాయుడు రావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత కారణాలను చూపించి రాకపోవడంతో తమ పిల్లలు చదువులో నష్టపోవాల్సి వస్తోందన్నారు.

పింఛన్ పెంపుపై మాట్లాకపోవడం విడ్డూరం



మాట్లాడుతున్న అందె రాంబాబు

గద్వాల అర్బన్: దివ్యాంగులకు రూ.6వేల పింఛన్, మహిళలకు, గీత కార్మికులకు, బీడీ కార్మికులకు రూ.4వేలు పెంచుతామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీపై మాట్లాకపోవడం విడ్డూరమని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ కో చైర్మన్ అందె రాంబాబు, రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పించాలని, పీహెచ్‌డీ, ఎస్ఈటీ నుంచి దివ్యాంగులందరికీ మినహాయింపు ఇవ్వాలని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే అన్ని ఉద్యోగాల్లో 4శాతం రిజర్వేషన్ కల్పించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. గ్రామ, మండల కమిటీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంల చిట్టిరాజు, హరీష్, నర్సింహులు, తిమ్మారెడ్డి, గోవిందు, అబ్దుల్ సుభాన్ పాష, అశోక్, ఆంజనేయులు, మోషన్న ఉన్నారు.

ఘనంగా ఉర్సు

దేవరకద్ర: మండల కేంద్రంలో సోమవారం మల్లె బారి సాహెబ్ ఉర్సులో భాగంగా గంధం మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలువురు ముస్లింలు దర్గాలో ఫాతేహాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ నాయకులు అరవింద్‌రెడ్డి, మండల నాయకులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఫారూఖ్, జమీల్ తదితరులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

యేసుక్రీస్తు మార్గంలో నడుద్దాం



భక్తిగీతాలు ఆలపిస్తున్న సేవకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: యేసు క్రీస్తు మార్గంలో నడుద్దామని పాస్టర్ డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో రక్షణ దుర్గం, జీసస్ పవర్ అపోస్తలిక్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం దైవసేవకుల సహవాసం.. ఉమ్మడి జిల్లా వేదిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ ప్రమోద్‌కుమార్ ప్రసంగించారు. యేసు క్రీస్తు నిజమైన రక్షకుడని, ఆ ప్రేమతో మనం జీవించాలని, ఐక్యతతో నడుచుకోవాలన్నారు. ప్రభువైన క్రీస్తూ బోధనలతో మంచి, చెడు, విచక్షణ, జ్ఞానం, సమతుల్యత ఉన్న జీవితాలు కలిగి ప్రతి ఒక్కరిని సన్మార్గంలో నడిపించే విధంగా తమ సంఘ పరిచర్యలో ఉండాలన్నారు. ఇతరుల పట్ల ప్రేమ స్వభావంతో ఉండాలన్నారు. మనం ఏమి బోధిస్తున్నామో, ఆ రీతిగా యేసుక్రీస్తూ మాదిరిగా జీవితాలు, ప్రతి ఒక్కరూ నమ్మకం, విశ్వాసంతో ఉండాలని కోరారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పాస్టర్లు హాజరయ్యారు. అనంతరం దైవ సేవకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రానున్న కాలంలో చేపట్టనున్న కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి సమావేశంలో చర్చించుకున్నారు. సమావేశంలో జీసస్ పవర్ అపోస్తలిక్ వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి శామ్యూల్, రక్షణ దుర్గం మినిస్ట్రీస్ డీఆర్‌వీ.ప్రసాద్, సేవకులు జాన్సన్‌పాల్, ఆర్.జాన్, ప్రసాద్, జాజుల ప్రభాకర్, ప్రసాద్, శ్రీకాంత్, రాబర్ట్, జ్యోతికుమార్, శ్యామ్, శాంసన్, శ్రీధర్, తిమోతి, ఆశీర్వాదం, పీఏ.దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి



అయిజ: విద్యార్థులు ఇతర విషయాల కంటే చదువు మీద ఎక్కువగా దృష్టి సారించి, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యార్థులకోసం వసతులు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



కెటిదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు నోట్ బుక్కులను అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఈఓ పురేందర్ పురేందర్‌కుమార్ సోమవారం పంపిణీ చేశారు. అయన మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థంగా వీటిని పంపిణి చేసినట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ప్రతి ఒక్కరు విద్యార్థి దశలోనే ఇష్టపడి చదవాలని అన్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు: ఒకరికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని పుల్లురు శివారులో కుక్క అడ్డు రావడంతో కల్వర్టును కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. సోమవారం హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గట్టు మండలం మిట్టదొడ్డికి చెందిన తమ్మలబాయి నరసింహులు, భార్య జయ్యమ్మ, తమ్ముడు రమేష్, బంధువు బద్దెన్న కారులో ఆదివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో అలంపూర్ ఆలయాలకు బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు పుల్లూరు శివారులోని కారుకు కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి, డ్రైవర్ రమేష్ కల్వర్టుకు ఢీకొట్టాడు. కారులో ఉన్న బద్దెన్నకు గాయాలు కాగా కర్నూల్ తరలించారు. నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు ఇలా. మండలంలోని కొండేరుకు చెందిన కటిక భాష (50) ఈనెల 21న కొండేరు స్టేజీలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు కర్నూల్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

ఉండవెల్లి: పొలం గెట్ల గొడవలో అన్నదమ్ములపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కంచుపాడుకు చెందిన ఆంజనేయరెడ్డి, వెంకటేష్‌రెడ్డి ఇద్దరు అన్నదమ్ములు. వీరికి ఉండవెల్లి శివారులో ఉన్న పంట పొలానికి వెళ్లగా గెట్ల వద్ద గొడవపడ్డారు. ఆంజనేయరెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా వీరి ఇరువురు ఫిర్యాదు సోమవారం ఫిర్యాదులు ఇవ్వగా, అన్నదమ్ములపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కల్లు సొసైటీలు ఏర్పాటు చేయాలి

రాజోళి: గ్రామాల్లో కల్లు వృత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి సొసైటీలను తయారు చేయాలని గౌడ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో వడ్డేపల్లి, రాజోళి గౌడ సంఘం నాయకులు మాట్లాడారు. గ్రామాల్లో కల్లు గీత కార్మికులకు ఏకతాటిపైకి తెచ్చి వారిని సొసైటీగా మారిస్తే బహుళ ప్రయోజనాలను గౌడ కులస్తులకు అందించవచ్చని, సంబంధిత అధికారులు దానిపై అవగాహన కల్పించాలని వారు కోరారు. అవగాహన లేని కారణంగా చాలా చోట్ల వ్యక్తిగత లైసెన్సులతో జరుగుతున్న కల్లు అమ్మకాలల్లో రాజకీయ రంగు పులుముకుంటుందని అన్నారు. సొసైటీలు ఏర్పాటు చేసుకుంటే, ఈత వనాలు పెంచుకుని స్వచ్ఛమైన కల్లు అమ్ముకునే అవకాశాలతో పాటు, ప్రభుత్వం నుంచి అందే పథకాలను తీసుకునే వీలుంటుందని గౌడ కులస్తుల్లో, గీత కార్మికుల్లో చాలా మందికి తెలియక సొసైటీలు ఏర్పాటు చేయలేకపోతున్నారని అన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ఆ దిశగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం వడ్డేపల్లి మండల అధ్యక్షుడు రాదా కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి పరమేష్‌గౌడ్, రాజోళి మండల ప్రధాన కార్యదర్శి సిద్దయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, మద్దిలేటి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై విచారణ చేయాలి



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు



అయిజలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

గద్వాల అర్బన్: నీట్ అవకతవకలపై సుప్రీం కోర్టు జడ్జితో విచారించాలని విచారణ ఎన్ఎస్‌యూఐ, యూఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆయా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సోమవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానం లోపాభూయిష్టంగా ఉందన్నారు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు ఈ విధానం కారణమన్నారు. నీట్ అక్రమాల వల్ల 24లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని, పరీక్షను రద్దు చేసి గతంలో మాదిరిగా పరీక్ష నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అయిజ: నీట్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఎదుట నిరసన తెలిపారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలింపాషా మాట్లాడారు. ఎంబీబీఎస్, ఇతర విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ – యూజీ ఎంట్రన్స్‌లో అవకవతకలు జరిగాయనే ఆరోపణలకు దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్పందించకపోవడం విచారకరమన్నారు. బీహార్‌లో రూ.30 లక్షలకు నీట్ ప్రశ్న పత్రాలు విక్రయించారని, ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నప్పటికి దేశ ప్రధాని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

కేజీబీవీల్లో అడ్మిషన్లు పెంచండి



కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ

శాంతినగర్: ఆడపిల్లల చదువులకు ఆసరాగా ఉంటున్న కేజీబీవీల్లో అడ్మిషన్లు పెంచి చదువులు కొనసాగేలా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ సూచించారు. వడ్డేపల్లి కేజీబీవీని చైర్‌పర్సన్ సోమవారం సాయంత్రం సందర్శించారు. పాఠశాల ఆవరణలు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను, రిజిస్టర్లను పరిశీలించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాజోళి కేజీబీవీని వడ్డేపల్లిలో కొనసాగిస్తున్నందున విద్యార్థుల సంఖ్య ఎక్కువై అన్ని సమస్యలు ఉన్నాయని చైర్‌పర్సన్‌కు విద్యార్థులు, ఎస్ఓ పద్మ, ఉపాధ్యాయులు వివరించారు. ఆడపిల్లలకు సంరక్షణగా కేజీబీవీలు ఉన్నందున అందరూ చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి కేజీబీవీల్లో అడ్మిషన్లు పెంచాలన్నారు. అడిషనల్ సెక్షన్లు చేయడానికి తనవంతు కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. రాజోళి కేజీబీవీని రాజోళిలోని ఉర్దూ పాఠశాలకు తరలించి వడ్డేపల్లి కేజీబీవీ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

ఇరువర్గాల దాడులపై డీఎస్పీ విచారణ



తుపత్రాలలో విచారణ చేస్తున్న డీఎస్పీ సత్యనారాయణ, పోలీస్ బృందం

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామంలో ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన కుమ్మరి ఉరుకుంద, మహేష్ గౌడ్ మధ్య ఘర్షణ జరిగింది. కుమ్మరి ఉరుకుంద, హనుమంతు, బుడ్డన్న ఇళ్లపై కొందరు వ్యక్తులు దాడులు చేసి ఇంట్లో సామగ్రి ధ్వంసం చేశారు. ఇరువర్గాలు పోలీసులకు పిర్యాదు చేసుకున్నారు. విచారణలో భాగంగా సోమవారం డీఎస్పీ సత్యనారాయణ, శాంతి నగర్ సీఐ రత్నం, అయిజ ఎస్ఐ విజయ భాస్కర్ గ్రామానికి చేరుకుని విచారించారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనపై కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. గతంలో ఉరుకుంద, మహేష్ వర్గాల మధ్య మాటామాటా పెరిగి మహేష్ గౌడ్‌పై కుమ్మరి ఉరుకుంద దాడి చేశాడు. ఇరువర్గాలపై పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. అయితే ఆదివారం రాత్రి మహేష్ గౌడ్ వర్గంవారు ప్రతీకార చర్యగా ఉరుకుందు వర్గం వారి ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.